# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 28, మే 2026


## అక్రమ మట్టి తరలింపుపై తహసీల్దార్ చర్యలు

### ..అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న మూడుట్రాక్టర్లు సీజ్

**కాగజ్‌నగర్ , మే 27, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండల తహసీల్దార్ మధుకర్ మంగళవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకుని ఈస్‌గాం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ మధుకర్ సీతానగర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం ఆరెగూడ కొనుగోలు కేంద్రం సందర్శనకు వెళ్తుండగా మార్గమధ్యంలో అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించాయి. వెంటనే వాటిని ఆపి సంబంధిత డ్రైవర్లను అనుమతి పత్రాల గురించి ప్రశ్నించగా ఎటువంటి అనుమతులు లేకపోవడం వెలుగులోకి వచ్చింది. దీంతో మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ఈస్‌గాం పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ తెలిపారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలింపులు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎలాంటి మట్టి తవ్వకాలు, రవాణా చేయరాదని సూచించారు.



## సింగరేణిలోనే శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం పనితీరు భేష్

- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్
- ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతులు అందజేత

**నస్పూర్, మే 27, ప్రభాతవార్త**

సింగరేణి సంస్థలోనే శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం ఉద్యోగుల పనితీరు అత్యంత అభినందనీయంగా ఉందని ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ కొనియాడారు. డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ పర్యవేక్షణలో వివిధ విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన డీవైపీఎం జీకే కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఆకుల అఖిలను బుధవారం జీఎం కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగుల టెర్మినల్ బెనిఫిట్స్, సీపీఆర్ఎంఎస్ కార్డుల మంజూరు, బదిలీలు, పదోన్నతులు, క్వార్టర్ల కేటాయింపు వంటి సంక్షేమ కార్యక్రమాల్లో ఈ విభాగం ముందువరుసలో నిలిచిందని పేర్కొన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వివరాల నమోదు సేవల విషయంలో పర్సనల్ విభాగం వేగంగా స్పందిస్తోందని జీఎం తెలిపారు. ముఖ్యంగా కార్మికుల గైర్హాజరుపై క్రమశిక్షణ చర్యలు, అప్పీళ్ల పరిష్కారాన్ని త్వరితగతిన పూర్తి చేస్తూ కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల కంటే శ్రీరాంపూర్ ముందంజలో నిలిచి ఏరియాకు మంచి గుర్తింపు తీసుకువచ్చిందని అభినందించారు. బహుమతులు అందుకున్న వారిని ఆదర్శంగా తీసుకొని పర్సనల్ విభాగంలోని ఇతర అధికారులు, సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతీ ఒక్కరు సమయపాలన పాటిస్తూ సంస్థలో శ్రీరాంపూర్ ఏరియాకు మరింత ప్రతిష్ట తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీవై పీఎం కిరణ్, సీనియర్ పీఓలు మురళి, ప్రశాంత్, సురేందర్, పర్సనల్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్, గంజా గస్తీ కార్యక్రమాలు

**సారంగాపూర్, మే 27, ప్రభాతవార్త:**

జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని చించోలి (బి) గ్రామంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ గ్రామ ప్రజలతో సమావేశమై గ్రామ భద్రత, నేరాల నియంత్రణ, యువత భవిష్యత్తు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, 5 ఆటోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుని, పెండింగ్‌లో ఉన్న 69 చలాన్లను క్లియర్ చేయించి రూ.12,655 నగదు వసూలు చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సూచించారు. దీంతో పాటు గ్రామాల్లో గంజా గస్తీ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు గంజాయి వినియోగం, దాని వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగం ఉంటుందని వివరించారు. అలాగే సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లు వాహనాలు నడపడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆస్తి సంబంధిత నేరాల నివారణలో ప్రజల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, ఎస్సైలు శ్రీకాంత్, లింబాద్రి, గణేష్, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానందవివేకానంద

**జైపూర్,మే 27, ప్రభాతవార్త**

ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జైపూర్ ఎ సి పి వెంకటేశ్వర్లు, మండల తహసీల్దార్ వనజ రెడ్డి, అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఎకరానికి 25 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి 28 నుండి 32 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ప్రతి సంవత్సరం కొనుగోలు లక్ష్యం పూర్తి అయ్యేదని, ఈ సంవత్సరం 4వ తేదీ వరకు 1 లక్ష 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమంలో భాగంగా పెద్దపల్లిలో 2 గోదాములు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్నికల నేపథ్యంలో హమాలీల కొరత ఏర్పడినందున స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు. లారీలు సమకూర్చడం కొరకు సింగరేణి సంస్థతో మాట్లాడగా లారీలను అందించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, 10 ఇసుక లారీలను సైతం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొందరు ఉద్దేశపూర్వకంగా రైతులను ఆందోళన చేపట్టే దిశగా రెచ్చగొడుతున్నారని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమం కోసం కలిసి రావాలని తెలిపారు.



చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో పంట ఆలస్యంగా వస్తుందని, ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయల సన్న రకం వడ్ల బోనస్, గృహ జ్యోతి, ఇతర పథకాల ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 51 వేల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 36 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, పెద్దపల్లి, కరీంనగర్‌లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని, అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములో 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే అవకాశం ఉందని, 50 మంది హమాలీలు పనిచేస్తున్నారని, రైస్ మిల్లులు, గోదాముల వద్ద ధాన్యం ప్రక్రియ వేగంగా జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 62 శాతం ట్యాబ్ ఎంట్రీ జరిగిందని, సంబంధిత రైతుల ఖాతాలలో 48 గంటలలో నగదు జమ చేయడం జరుగుతుందని, 3 రోజులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మొక్కజొన్న పంట కొనుగోలు లక్ష్యం 8 వేల 700 మెట్రిక్ టన్నులు కాగా ఇంకా 3 వేల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేయవలసి ఉందని, 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రావలసి ఉందని తెలిపారు. గత సంవత్సరం జూన్ 6వ తేదీన ధాన్యం ప్రక్రియ పూర్తి కాగా ఈసారి మరింత ముందుగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్, మండల తహసిల్దార్‌తో కలిసి జైపూర్ మండలం టేకుమట్ల లోని కొనుగోలు కేంద్రం, బాలాజీ గోదాము, షెట్ పల్లి లోని ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందారంలోని వరలక్ష్మి రైస్ మిల్, సుముఖ గోదాములను సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లా విద్యాధికారిని కలిసిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం
## ...పాఠ్యపుస్తకాలు, ఇంక్రిమెంట్లు, సమ్మర్ క్యాంప్ బిల్లులపై వినతి



**కాగజ్‌నగర్ రూరల్, మే 27, ప్రభాతవార్త :**

పాఠశాలల సమస్యల పరిష్కారంపై గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు మంగళవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో జిల్లా విద్యాధికారి లలితను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠ్యపుస్తకాలు టెండర్ విధానంలో నేరుగా పాఠశాలలకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయుల సర్వీస్ పుస్తకాలు వెంటనే పూర్తి చేయాలని కోరారు. అలాగే వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ ప్రతి నెల 15వ తేదీలోపు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. సమ్మర్ క్యాంపులకు సంబంధించిన బకాయి నిధులు విడుదల చేయాలని, ప్రధానోపాధ్యాయులకు కోఆర్డినేటర్ పోస్టుల కల్పనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ప్రెస్‌నోట్ సమర్పించారు. నోట్‌బుక్స్ కూడా సమయానికి పాఠశాలలకు చేరేలా చూడాలని తెలిపారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన కొందరి ఇయల్స్ ప్రొసీడింగ్స్ ఇంకా జారీ కాలేదని, ఆ సమస్యను కూడా జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పర్ష చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసాల ప్రభాకర్ తదితరులు సమస్యలపై చర్చించారు. ప్రతి సమస్యకు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని జిల్లా విద్యాధికారి శ్రీమతి లలిత హామీ ఇచ్చారు.

## క్షయవ్యాధి స్క్రీనింగ్ అవగాహన సదస్సు

**వాంకిడి, మే 27, ప్రభాతవార్త :**

టిబి ముక్త్ భారత్ అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం చిచుపల్లి గ్రామపంచాయతీ పరిధి ప్రాథమిక పాఠశాల ఆవరణలో క్షయ వ్యాధి స్క్రీనింగ్, అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ స్క్రీనింగ్ లో భాగంగా హ్యాండ్ హోల్డ్ ఎక్స్‌రే ద్వారా పరీక్షలు, హెచ్ఐవి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినయ్



మాట్లాడుతూ.. ఎక్స్‌రే పరీక్షల్లో అబనార్మల్ వచ్చినవారు తెమడా పరీక్షకు ఆశాల సహాయంతో ఆసిఫాబాద్‌లోని టీబీ యూనిట్ లో ఎన్ఏఏటి పరీక్ష చేపించుకోగలరని అన్నారు. వ్యాధి నిర్ధారణ ఐనా వారికి ఉచితం గా పి హెచ్ సి లో మందులు తీసుకొని క్రమం తప్పకుండ వాడితె ఈ వ్యాధి నయం అవుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగు, వార్డుమెంబెర్, లేతుబాయ్, పి ఎం జెన్మన్ మెడికల్ ఆఫీసర్ శ్రీజ, సిబ్బంది, జిల్లా క్షయ వ్యాధి సమన్వయ అధికారి పవన్‌కుమార్, హెచ్ఇఓ రవిదాస్ పి హెచ్ ఎన్ ప్రమీల, డాక్టర్ రియాజ్, ఎం ఎల్ హెచ్ పి, మమతా, ఏఎన్ఎం గోదు బాయ్, ఆశాలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పురాతన ఆలయాలకు షెడ్డు మంజూరు చేయాలని వినతి

**వాంకిడి, మే 27, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం లోని పురాతన ఆలయమైనటువంటి శివకేశవ ఆలయ ప్రాంగణంలో అదేవిధంగా రామ్ నగర్ పోచమ్మ ఆలయంలో భక్తులకు సౌకర్యవంతంగా ఉండేందుకు షెడ్ నిర్మాణం మంజూరు చేయవలసిందిగా మాజీ శాసన సభ్యులు ఆత్రం సక్కు కు వినతి పత్రం అందజేయడం జరిగింది. భక్తులకు వర్షాకాలంలో మరియు ఎండాకాలంలో ఇబ్బంది కలగకుండా షెడ్ నిర్మాణం మంజూరు చేయాలని అదేవిధంగా దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మాజీ శాసనసభ్యులు సక్కు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.



## ఉత్తమ ప్రధానాచార్యులకు సన్మానం

**ఆసిఫాబాద్, మే 27, ప్రభాతవార్త :**

సరస్వతీ విద్యాపీఠంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానాచార్యులను ఘనంగా సన్మానించారు బుధవారం శ్రీ సరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మే 27 నుండి 28 వరకు జరుగుతున్న వర్షారంభ సమావేశాల సందర్భంగా సరస్వతీ విద్యాపీఠంలోని ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానాచార్యులకు సన్మానంలో భాగంగా ఆసిఫాబాద్ పాఠశాల ప్రధానాచార్యులు గుండేటి కోటేశ్వరరావుకు ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్ శాలువ కప్పి ప్రశంస పత్రంతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలకు దీటుగా శ్రీ సరస్వతి శిశుమందిర్లు వెలిసాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ప్రాంత అధ్యక్షులు ప్రొఫెసర్ తక్కళ్ళపల్లి తిరుపతి రావు, ప్రాంత సంఘటన కార్యదర్శి పతకమూరి శ్రీనివాస్, ప్రాంత కార్యదర్శి అనఘా వెంకటలక్ష్మి ్ర, దక్షి ణ మధ్య క్షేత్ర అధ్యక్షులు చామర్తి ఉమా మహేశ్వర రావు, శ్రీ లింగం సుధాకర్ రెడ్డి



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన నాయకులు



**తాండూర్, మే 27, ప్రభాతవార్త :**

మండలంలోని బోయపల్లి బోర్డు సమీపంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బిజెపి నాయకులు సందర్శించారు. కొనుగోలు కేంద్రం వద్ద నిల్వ ఉన్న వరి ధాన్యపు బస్తాలను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి ముందుచూపు లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం అమ్మడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, ఎఫ్.సి.ఐ. బోర్డు మెంబర్ పులగం తిరుపతి, పార్టీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, నాయకులు చిలువేరు శేషగిరి, పాగడి చిరంజీవి, శ్రీ కృష్ణ దేవరాయలు, పుట్ట కుమార్, సిద్ధం మల్లేష్, ధర్మరాజుల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్య కాల్చితే కేసులు నమోదు
### .. మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ
### ...కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లో రైతులకు హెచ్చరిక



**కాగజ్‌నగర్‌రూరల్, మే 27, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల పరిధిలో ఎవరైనా రైతులు వరి కొయ్య (పంట అవశేషాలు) కాల్చితే కఠిన చర్యలు తీసుకొని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి, పొలాల్లో కాల్చిన వరి కొయ్యలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడంతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని వివరించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు నశిస్తాయని, వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని తెలిపారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంట అవశేషాలను తగలబెట్టడం నేరమని, ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. పంట అవశేషాలను కాల్చకుండా వాటిని భూమిలో కలిపి సేంద్రియ ఎరువులుగా వినియోగించాలని రైతులకు సూచించారు. పశువుల మేతగా, కంపోస్ట్ తయారీకి కూడా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రైతులు అవగాహనతో వ్యవహరించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## విఏఓ ల సమస్యలు పరిష్కరించాలి

**తాండూర్, మే 27, ప్రభాతవార్త :**

విఏఓల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనిబిజెపి రాష్ట్ర వర్గ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, ఎఫ్.సి.ఐ. బోర్డు మెంబర్ పులగం తిరుపతి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన దీక్ష చేస్తున్న విఏవోల దీక్ష శిబిరాన్ని బుధవారం బిజెపి నాయకులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఏఓల సమస్యల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి అవలంబించడం సరికాదన్నారు. విఏవోల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, పార్టీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, నాయకులు చిలువేరు శేషగిరి, పాగడి చిరంజీవి, శ్రీ కృష్ణ దేవరాయలు,

# బారి గాలులకు రోడ్డుపై కూలిన చెట్టు వెంటనే తొలగించిన పోలీసులు

**వేమనపల్లి, మే 27, ప్రభాతవార్త**

రాత్రి వీచిన బారి గాలుల కారణంగా మల్లంపేట-నీల్వాయి అటవీ మార్గంలో భారీ చెట్టు రోడ్డుపై కూలి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని చెట్టును తొలగించారు. అనంతరం రహదారిని శుభ్రపరిచి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. స్థానికులు పోలీసుల సేవలను అభినందించారు.



## పంట అవశేషాలు కాల్చితే జరిమానాలు తప్పవు

**వేమనపల్లి, మే 27, ప్రభాతవార్త**

పంట అవశేషాలు లేదా గడ్డి కాల్చితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) నిబంధనల ప్రకారం రైతులకు జరిమానాలు విధిస్తారని మండల వ్యవసాయ అధికారి సోదరి వీరన్న బుధవారం నీల్వాయి గ్రామ పంచాయతీలోని మామడ రైతులకు తెలిపారు. 2 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు రూ. 2,500, 2 నుంచి 5 ఎకరాల వరకు ఉన్న వారికి రూ. 5,000, 5 ఎకరాలకు పైగా ఉన్న వారికి రూ. 15,000 జరిమానా ఉంటుందని చెప్పారు. పంట అవశేషాలు కాల్చడం వల్ల గాలి కాలుష్యం పెరగడంతో పాటు నేల సారవంతత తగ్గిపోతుందని పేర్కొన్నారు. రైతులు అవశేషాలను కాల్చకుండా కంపోస్ట్, మల్చింగ్ వంటి పద్ధతులు ఉపయోగించాలని సూచించారు.



# పంట అవశేషాలకు నిప్పు పర్యావరణానికి ముప్పు

**హాజీపూర్, మే 27,ప్రభాతవార్త**

కర్ణమామిడి రైతు వేదికలో బుధవారం జరిగిన పంట అవశేషాలకు నిప్పు-పర్యావరణానికి ముప్పు కార్యక్రమంలో మంచిర్యాల ఏడిఏ క్రిష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భౌతిక స్థితికి పెను విఘాతం పంట అవశేషాల దహనంతో నష్టాలు గతంలో కంటే పంటల ఉత్పత్తులను అధికంగా అందించడానికి పంట కోత కోసం రైతు సమాజమంతా యాంత్రీకరణ వైపు పయనిస్తోంది అన్నారు. ప్రస్తుతం వరి కోత కంబైన్ హార్వెస్టర్ల ద్వారా జరుగుతోంది. కంబైన్ హార్వెస్టర్ల వినియోగం వల్ల ధాన్యాన్ని త్వరగా కోయడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతున్నప్పటికీ పంట అవశేషాలు పెద్ద మొత్తంలో మిగులుతున్నాయి. రైతులు ఈ అవశేషాలను కాల్చివేయడం వల్ల నేల భూసారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరగడం, అగ్ని ప్రమాదాలు సంభవించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. పంటల కాల్చివేత వలన రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుంది. కార్బన్ డైఆక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు విడుదలై వాయు కాలుష్యం పెరుగుతుంది.భూమి యొక్క ఉష్ణోగ్రత పెరిగి భూసారం తగ్గుతుంది.పంటల ఉత్పాదకత తగ్గిపోతుంది. పశువులకు కావలసిన పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది.పొలాల్లో ఉండే పాములు, పక్షులు, చీమలు, కీటకాలు వంటి జీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తాయి. నేలలోని సేంద్రియ పదార్థాలు దెబ్బతింటాయి. గడ్డి, మేత గడ్డిని తిన్న పశువులు అనారోగ్యానికి గురవుతాయన్నారు. పంట అవశేషాలను మట్టిలో కలిపి సేంద్రియ ఎరువులుగా ఉపయోగించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ క్రిష్ణ, ఏఈఓ కొమురయ్య, రైతులు పాల్గొన్నారు.



## వరి కొయ్యలను కాల్చితే చట్టపరమైన చర్యలు తప్పవు

**చెన్నూరు, మే 27, ప్రభాతవార్త**



రైతులు వరి పంట కోసిన తర్వాత వరి కొయ్యలను కాల్చడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా చూస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఎ.సురేఖ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న వంటి పంటలు కోత అనంతరం మిగిలిన పొడి గడ్డి, పంట అవశేషాలను పొలాల్లో తగులబెట్టడం వల్ల వాయు కాలుష్యం పెరిగి, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలుగుతుందని. పొగ, బూడిద వల్ల కంటి మంటలు, శ్వాస సమస్యలు, ఆస్తమా రోగులకు ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. అందువలన పంట అవశేషాలను తగులబెట్టవద్దని, వాటిని పొలంలోనే కుళ్ళబెట్టడం, పశువులకు మేతగా ఉపయోగించాలన్నారు. హ్యాపీ సీడర్, మల్చర్ వంటి యంత్రాల ద్వారా పంట అవశేషాలను యాజమాన్యం చేయాలని వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరమైతే మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

## మహిళా సంఘాలకు సొంత భవనాలు

**వేమనపల్లి, మే 27, ప్రభాతవార్త**



మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్ అన్నారు. వేమనపల్లి మండలంలోని నీల్వాయి, కల్మలపేట, కేతనపల్లి, గొర్లపల్లి, రాజారం గ్రామాల్లో మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సూచనల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుమారస్వామి స్థానిక సర్పంచులు పాల్గొన్నారు. మహిళలు స్వయం ఉపాధి, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ భవనాలు ఉపయోగపడతాయని తెలిపారు. సర్పంచులు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయికృష్ణ, కొట్రంగి శ్రీనివాస్, మడే శ్రీనివాస్, దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, శేఖర్ రెడ్డి, సయ్యద్ సాబీర్ అలీ, ఒడిల రాజన్న, కామెర గణేష్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి.... ఆర్థిక సహాయం అందజేసిన మేయర్

**నస్పూర్, మే 27, ప్రభాతవార్త**



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్‌లో అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా వేల్పుల నరసయ్య ఇంటిపై చెట్టు విరిగిపడి రేకులు పగిలిపోయాయి. స్థానిక కార్పొరేటర్ ద్వారా సమాచారం అందుకున్న మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని నరసయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాద వివరాలను తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సంఘటనపై మేయర్ ధర్ని మధుకర్ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ డీసీసీ అధ్యక్షురాలు సురేఖలకు ఫోన్ ద్వారా వివరించారు. వారు తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి రూ. 5,000 తక్షణ ఆర్థిక సహాయాన్ని మేయర్ చేతుల మీదుగా అందజేశారు. గాలుల కారణంగా రహదారులపై, ఇళ్లపై విరిగిపడిన చెట్లను తక్షణమే తొలగించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 27వ డివిజన్ కార్పొరేటర్ కొండ్ర రాజేశ్వరి లింగయ్య, కార్పొరేటర్ అమృత రాజ్ కుమార్, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### నేత్రదాత జక్కోజు రాజ మొగిలి కుటుంబం ఆదర్శం

## ప్రజలు నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలి

**బెల్లంపల్లి, మే 27, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంప్ బస్తికి చెందిన నేత్రదాత జక్కోజు రాజ మొగిలి సంస్మరణ సభను జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో వారి నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజ మొగిలి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించడం గొప్ప సేవ అని కొనియాడారు. వారి నేత్రాల ద్వారా ఈ ప్రపంచాన్ని చూస్తున్న వారు ఉన్నంత వరకు ఆయన జీవిస్తూనే ఉంటారని అన్నారు. ఈ సంఘటన మరింత మందికి స్ఫూర్తిగా నిలవాలని, ప్రజలు అపోహలు విడిచిపెట్టి నేత్ర, అవయవ దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదానం ద్వారా చూపు, అవయవ దానం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చని, శరీర దానం ద్వారా వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. సమాజానికి మేలు చేసే పనులు చేస్తూ ధన్యజీవులుగా నిలవాలని సూచించారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ తీవ్ర విషాద సమయంలో కూడా రాజ మొగిలి కుటుంబ సభ్యులు నేత్రదానం చేయడం అభినందనీయం అన్నారు. సమితి ఆధ్వర్యంలో ఇది 16వ నేత్రదాన కార్యక్రమమని వెల్లడించారు. మరణించిన తర్వాత ఎనిమిది గంటలలోపు కార్నియా సేకరించి ఇద్దరు అంధులకు చూపు ఇవ్వగలమని తెలిపారు. అలాగే బ్రెయిన్ డెడ్ పరిస్థితుల్లో అవయవ దానం ద్వారా ఆరుగురి ప్రాణాలు కాపాడవచ్చని, శరీర దానం ద్వారా వైద్య విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగపడుతుందని వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమాజానికి ఉపయోగపడేలా దానాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నిచ్చకోల వంశీ, మాజీ కౌన్సిలర్ నీలి కృష్ణ, దావ రమేష్ బాబు, హనుమాండ్ల రమాదేవి, కందుల రాజన్న, బియ్యాల గణేష్, జంబోజు చంద్రశేఖర్, డోలి సుకుమార్, భీమిని కనకయ్య తదితరులు పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, బస్తివాసులు కూడా హాజరయ్యారు.



## ప్రయాణికుల సౌకర్యార్థం సిమెంట్ బెంచిల ఏర్పాటు

## జనహిత సేవా సమితి సేవలకు ప్రశంసలు

### మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు

**బెల్లంపల్లి, మే 27, ప్రభాతవార్త**

జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో, దాతల సహకారంతో బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం నాలుగు సిమెంట్ బెంచిలను ఏర్పాటు చేశారు. ఈ బెంచిలను బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతిరమేష్ బాబు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాలను గుర్తించి సదుపాయాలు కల్పించిన జనహిత సేవా సమితి సభ్యులను మరియు దాతలను అభినందించారు. సమాజానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత పెరగాలని ఆకాంక్షించారు. అనంతరం దాతలను శాలువాలతో సత్కరించారు. జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రయాణికులు కూర్చునేందుకు సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని గమనించి, ఈ బెంచిల ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. దాతలను సంప్రదించగానే వారు వెంటనే స్పందించి సహకరించడం సంతోషకరమని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలలో నవదుర్గ ట్రేడర్స్, ప్రకాష్ స్పోర్ట్స్ అండ్ సైకిల్ స్టోర్స్, లక్ష్మి మసాలా కిరాణం యాజమాన్యాలు, అలాగే జనహిత అన్నపూర్ణ వంట మాస్టర్ నిచ్చకోల గురుస్వామి ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో బెంచిల దాతలు అచ్చె శ్రీనివాస్, గర్రెపల్లి శ్రీనివాస్, గంధే శేఖర్, నిచ్చకోల గురుస్వామి, కౌన్సిలర్ నిచ్చకోల వంశీ, మాజీ కౌన్సిలర్ నీలి కృష్ణ, నాయకులు దావ రమేష్ బాబు, బండారి ప్రవీణ్, పోచంపల్లి హరీష్, సీనియర్ జర్నలిస్టు షఫీ, ఆటో యూనియన్ అధ్యక్షుడు కట్ట రాం కుమార్, జనహిత సేవా సమితి ఉపాధ్యక్షుడు కందుల రాజన్న, సహాయ కార్యదర్శులు పనాస వెంకటేష్, బియ్యాల గణేష్, కార్యవర్గ సభ్యులు డోలి సుకుమార్, భీమిని కనకయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలు రాత్రి పగలు అప్రమత్తంగా ఉండాలి

### సిఐ పర్స రమేష్

**క్యాతన్‌పల్లి, మే 27, ప్రభాతవార్త**

ప్రజలు రాత్రి, పగలు అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సిఐ పర్స రమేష్ అన్నారు. బంగారం దొంగతనం జరిగిన 24 గంటల్లోనే దొంగలను పట్టుకుని బుధవారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్ తో కలిసి విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన నల్లాల రాయ మల్లక్క అనే మహిళ తమ ఇంటి ఆవరణలో నిద్రపోయి లేచి చూసుకుంటే మెడలోని బంగారు ఆభరణాలు కనబడడం లేదని ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేసి దొంగతనం చేసిన దంపతులను గజ్జి ఐలక్క గజ్జి శ్యామ్ లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బంగారు వస్తువులను, విలువైన వస్తువులను జాగ్రత్త గా చేసుకోవాలని తెలిపారు. అందరిని గుడ్డిగా నమ్మి మోసపోవద్దని కోరారు. ఎలాంటి నేరం జరిగిన, మోసానికి గురైన వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.



## ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించిన మంత్రి వివేక

**మందమర్రి, మే 27, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి అభినందించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చడం గర్వకారణమని అన్నారు. కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించడం ద్వారా విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. విద్య ద్వారానే సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, ప్రతి విద్యార్థి లక్ష్యసాధన దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, తల్లిదండ్రుల సహకారం కూడా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారి, తహసీల్దార్, పురపాలక కమిషనర్, ప్రభుత్వ పాఠశాలల సిబ్బంది, డీసీసీ, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## పంట అవశేషాలకు నిప్పు పర్యావరణానికి ముప్పు

**లక్షెట్టిపేట, మే 27, ప్రభాతవార్త**

పంట అవశేషాలకు నిప్పు పెట్టడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఏడిఏ మామిడి కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గతంలో కంటే పంటల ఉత్పత్తులను అధికంగా సాధించడానికి పంట కోత కోసం రైతు సమాజమంతా యాంత్రీకరణ వైపు పయనిస్తోంది. ప్రస్తుతం వరి కోత కంబైన్ హార్వెస్టర్‌ల ద్వారా జరుగుతోంది. కంబైన్ హార్వెస్టర్ల వినియోగం వల్ల ధాన్యాన్ని త్వరగా కోయడంతో పాటు సమయం, ఖర్చు ఆదా అవుతున్నప్పటికీ పంట అవశేషాలు పెద్ద మొత్తంలో మిగులుతున్నాయి. రైతులు ఈ అవశేషాలను కాల్చివేయడం వల్ల నేల భూసారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరగడం, అగ్ని ప్రమాదాలు సంభవించడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. పోషకాలు నేలలో కలిస్తే భూసారం పెరుగుతుంది. పంట అవశేషాలను కాల్చడం వల్ల ఇవి నశించి భూమి ఉత్పాదకత తగ్గుతుంది. రోటవేటర్‌తో దున్నడం వలన వరి కొయ్య కాళ్ళు చిన్న ముక్కలుగా, పౌడర్‌గా మారును, బస్తా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా వేస్ట్ డి కంపోజర్ వలన తొందరగా భూమిలో కుళ్ళిపోయిన భూసారం పెరుగుతుంది. దీంతో ఎకరాకు 8-10 ట్రాక్టర్ల చెరువు మట్టి వేసినట్లు అవుతుంది, భూమి నీరు గ్రహించే శక్తి పెరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఏడిఏ మంచిర్యాల మామిడి క్రిష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్. శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## శ్రీరాంపూర్‌లో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

### జూన్ 2న టీ రన్, సాంస్కృతిక ప్రదర్శనలు.. ఉత్తమ ఉద్యోగులకు సత్కారం

**నస్పూర్, మే 27, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూన్ 2న శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో నిర్వహించనున్నట్లు ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2న ఉదయం 8 గంటలకు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడంతో వేడుకలు ప్రారంభమవుతాయి. అక్కడ నుంచి షిర్కె, సిసిసి, శ్రీరాంపూర్ మీదుగా జీఎం కార్యాలయం వరకు బతుకమ్మలు, ఒగ్గుడోలు, పోతరాజులు, తెలంగాణ ధూం ధాం కళాకారుల ప్రదర్శనలతో భారీ టీరన్, ర్యాలీ నిర్వహిస్తారు. జీఎం కార్యాలయం వద్ద ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి, అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం కార్యాలయ ప్రాంగణంలో జీఎం చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో విద్యార్థులు, సేవా సభ్యులు, సింగరేణి కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉత్తమ ఉద్యోగులను ఈ వేదికపై సత్కరించనున్నారు. ప్రగతి స్టేడియం ప్రాంగణంలో సింగరేణి సంస్థకు చెందిన రెస్క్యూ, మెడికల్, ఫారెస్ట్, మైన్స్, సేవా సమితి, కమ్యూనికేషన్ విభాగాల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. వివిధ రకాల తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునే వారు జీఎం కార్యాలయం పర్సనల్ విభాగంలో సంప్రదించాలని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, మే 28, ప్రభాతవార్త:**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా, వర్షాలు పడేలోగా మొత్తం ధాన్యం మిల్లులకు చేర్చాలని స్పష్టం చేశారు. బుధవారం ఆయన సోన్ మండల కేంద్రంతో పాటు జాఫ్రాపూర్, కొరిటికల్ గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం సోన్ మండల కేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి చేరుకున్న కలెక్టర్, అక్కడి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇప్పటివరకు కేంద్రానికి వచ్చిన మొత్తం ధాన్యం, కొనుగోలు చేసి మిల్లులకు తరలించిన ధాన్యం, నిర్ణీత తేమ శాతానికి చేరి తూకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతు తీసుకువచ్చిన ధాన్యం తేమ శాతం సరిపోగానే అదే రోజు తూకం వేయాలని, తూకం వేసిన ధాన్యం ఒక్క బస్తా కూడా కేంద్రంలో ఉంచకుండా వెంటనే లారీల్లో మిల్లులకు పంపించాలని ఐకేపీ సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ఆలస్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్కడి నుంచి నేరుగా జాఫ్రాపూర్ గ్రామంలోని పలు రైస్ మిల్లులకు వెళ్లిన కలెక్టర్, కొనుగోలు కేంద్రాల నుంచి వస్తున్న ధాన్యం లారీల అన్‌లోడింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. మిల్లుల బయట వేచి ఉన్న లారీల సంఖ్య, రోజుకు ఎన్ని లారీలు అన్‌లోడ్ చేస్తున్నారు వంటి వివరాలు మిల్లర్లను అడిగి తెలుసుకున్నారు. వాతావరణ శాఖ వర్ష సూచన నేపథ్యంలో అన్‌లోడింగ్‌లో ఒక్కరోజు ఆలస్యమైనా ధాన్యం తడిసి రైతులు నష్టపోతారని గుర్తుచేశారు. హమాలీల కొరత ఉంటే వెంటనే అదనపు సిబ్బందిని పెట్టుకోవాలని, రాత్రి వేళల్లో కూడా అన్‌లోడింగ్ చేసి లారీలను ఖాళీ చేయాలని మిల్లర్లకు స్పష్టం చేశారు. లారీలు నిలిచిపోతే కొనుగోలు కేంద్రాల్లో తూకం ఆగిపోతుందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ నుంచి మిల్లింగ్ వరకు ఎక్కడా అంతరాయం లేకుండా చూసేందుకు పౌరసరఫరాలు, మార్కెటింగ్, రెవెన్యూ శాఖల అధికారులు ఉమ్మడిగా పనిచేయాలని, ప్రతి మిల్లుకు ఒక నోడల్ అధికారిని నియమించి రోజువారీ నివేదిక తెప్పించుకోవాలని ఆదేశించారు. మధ్యాహ్నం మామడ మండలం కొరిటికల్ గ్రామంలోని రైస్ మిల్లులు, కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ కూడా అన్‌లోడింగ్ వేగం పెంచాలని, వచ్చిన ధాన్యాన్ని అదే రోజు దిగుమతి చేసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్ఓ రాజేందర్, డీఎం సుధాకర్, సోన్ తహసిల్దార్ సంతోష్, మామడ తహసిల్దార్ శ్రీనివాస్, సంబంధిత మండలాల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇంకా సుమారు 35 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

## డోర్లి ఓసి। గనిని సందర్శించిన కోల్ కంట్రోల్ అధికారులు

**బెల్లంపల్లి, మే 27, ప్రభాతవార్త**

బెల్లంపల్లి ఏరియాలో మూతపడిన డోర్లి ఓసి1 గనిని కోల్ కంట్రోల్ ఆఫీస్‌కు చెందిన అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కోల్ కంట్రోల్ ఆఫీస్ ఓఎస్డి ఎ. కృష్ణమోహన్ రావు, నాగ్‌పూర్ కోల్ కంట్రోల్ ఆఫీస్ ఓఎస్డి తీష్ గజ్ భియే పాల్గొన్నారు. మూతపడిన గని ప్రాంతం మరియు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యావరణ పరిరక్షణ చర్యలను వారు సమీక్షించారు. నాటిన మొక్కలు, పెరిగిన వృక్షాలను పరిశీలించడంతో పాటు, నీటి నిర్వహణ, మృత్తిక సంరక్షణ చర్యలపై అధికారులు వివరాలు తెలుసుకున్నారు. అలాగే భద్రతా చర్యల భాగంగా ఏర్పాటు చేసిన రక్షణ కంచెను కూడా పరిశీలించారు. అంతకుముందు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఇంచార్జి జిఎం మచ్చగిరి నరేందర్ అధికారులు సమక్షంలో ఏరియా కార్యకలాపాలపై సమగ్ర వివరాలను అందించారు. అనంతరం అధికారులను సన్మానించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో డోర్లి ఓసి1 ప్రాజెక్ట్ అధికారి, ఇంచార్జి ఎస్ఓ టు జిఎం ఎన్. ఉమాకాంత్, కార్పొరేట్ అదనపు మేనేజర్లు సిహెచ్. శ్రీనివాస్, పి. రవికిరణ్, వి. తిరుపతి, గోనె బాబ్జి, డివైఎస్ఎస్ఓ రమేష్, ఏరియా సర్వే అధికారి అఫ్సర్ పాషా, డోర్లి ఓసి1 మేనేజర్ మహేష్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వాలెగాం గ్రామస్థులు

**భైంసా, మే 27, ప్రభాతవార్త:**

భైంసా మండలం వాలెగాం గ్రామానికి చెందిన భూమిలేని నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ శశిభూషణ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వాలెగాం గ్రామంలో సుమారు 40 నిరుపేద కుటుంబాలు భూములు లేక కూలి పనులు చేసుకుంటూ అత్యంత దయనీయ పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం భూమిలేని పేదల కోసం కేటాయించిన ప్రభుత్వ భూములను గ్రామంలోని ఇప్పటికే భూములు కలిగిన కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించి పట్టాలు పొందినట్లు ఆరోపించారు. ముఖ్యంగా సర్వే నంబర్ 121 నుండి 131 వరకు ఉన్న ప్రభుత్వ భూములను కొందరు తమ పేర్లపై అక్రమంగా పట్టాలు చేసుకుని, అదే భూముల ఆధారంగా రుణమాఫీ, క్రాప్ లోన్లు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందుతున్నారని వాపోతున్నారు. అసలు అర్హులైన భూమిలేని నిరుపేదలు మాత్రం నేటికీ కూలి పనులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను నిజమైన అర్హులైన భూమిలేని నిరుపేద కుటుంబాలకు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిరోల్లా నవీన్, సార్ల అరుణ్, సదొల్ల సంజు, గణబాయి, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

